క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు.. తిరుపతికి చెందిన సుమంత్(31), సుబ్రమణ్యం(35) ద్విచక్ర వాహనంపై వెంకటగిరికి వెళుతున్నారు. అంజిమేడు సమీపంలో ముందు వెళుతున్న బస్సును అధిగమించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్ర పోటీలకు ఎంపిక


మన్విత

సత్యవేడు: మండలంలోని రాజగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వతరగతి విద్యార్థిని కె.మన్విత ఓంగోలులో జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైందని వ్యాయామ ఉపాధ్యాయుడు కె.మణి తెలిపారు. పుత్తూరులో గురువారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికై ందని పేర్కొన్నారు. బాలికను హెచ్‌ఎం పి.మురళీధర్, ఉపాధ్యాయులు అభినందించారు.

అక్షయక్షేత్రంలో అన్నదానం

రేణిగుంట: రేణిగుంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిన్నక్కగారి తిరుమలరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని రేణిగుంట అక్షయక్షేత్రంలో శుక్రవారం ఆయన అభిమానులు అన్నదానం చేశారు. గాజులమండ్యంకు చెందిన వెంకీ, భారతి దివ్యాంగుల సమక్షంలో కేక్ కత్తిరించి పంచిపెట్టారు. అంతకుముందు ఉదయం లక్ష్మీపురానికి చెందిన మోహన్, రామ్మూర్తి ఆధ్వర్యంలో కేక్ కత్తిరించారు. అల్పాహారం అందజేశారు.

శ్రీసిటీ హైటెక్ స్టేషన్ ఎస్‌ఐగా హరిప్రసాద్



వరదయ్యపాళెం: శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ రెండవ ఎస్‌ఐగా హరిప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పూతలపట్టు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసిటీ పరిధిలో భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పటిష్టమైన నిఘా చర్యలు తీసుకుంటామన్నారు.

తంగిరాల వీరరాఘవశర్మ కన్నుమూత


వీరరాఘవ శర్మ

శ్రీకాళహస్తి: పట్టణంలోని బ్రాహ్మణ ప్రముఖుడు తంగిరాల వీరరాఘవశర్మ గురువారం రాత్రి మృతి చెందారు. అనేకమంది ఈయన వద్ద పురోహిత శిక్షణ తీసుకున్నారు. ఆయనకు ఒక కుమారుడు ఉన్నారు. శుక్రవారం భాస్కరపేటలో అంత్యక్రియలు నిర్వహించారు.

కోబాకలో పగలే చోరీ

ఏర్పేడు: మండలంలోని కోబాక గ్రామంలో శుక్రవారం పగలే చోరీ జరిగింది. సీఐ శ్రీహరి కథనం మేరకు .. గ్రామానికి చెందిన మేండ్రగుత్తి శాంతి ఇటీవలే కొత్త ఇంట్లో చేరారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు కుటుంబ సభ్యులతో కలిసి పాత ఇంట్లో ఉన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు కొత్తింటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి చోరీ చేశారు. అనంతరం వచ్చిన శాంతి కుటుంబసభ్యులు చూడగా తలుపులు తెరచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూసి చోరీ జరిగిన గుర్తించారు. రెండు బీరువాలను తెరచి, 8, 6, 4 గ్రాముల బంగారు ముక్కు పుడకలు, 12 గ్రాముల బంగారు నల్లపూసల దండ, 4, 2 గ్రాముల బంగారు ఉంగరాలు, 2 గ్రాముల చెవి రింగ్, 12 గ్రాముల వెండి గొలుసులు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం రూ.1.95 లక్షల సొత్తు చోరీ అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

బోయకొండలో రాహుకాల అభిషేక పూజలు


రాహుకాల అభిషేక పూజలకు తరలివచ్చిన భక్తజనం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు చేశారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధిచేసి మామిడి, వేపాకు, పూలతోరణాలతో అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఉదయం 10:30 గంటల నుంచి 12 మధ్యలో రాహుకాల అభిషేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయం వద్ద రద్దీ నెలకొంది. అధికారులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎస్‌ఐ రవికుమార్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- వాతావరణ మార్పులతో వణికిస్తున్న వైరల్ ఫీవర్
- బాధితులతో ఆస్పత్రుల కిటకిట
- పరిసరాల శుభ్రత పాటించాలంటున్న వైద్యాధికారులు

ఇటీవల కురిసిన వర్షాలు.. ప్రస్తుతం మంచు.. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. సత్యవేడు నియోజకవర్గంలో ఆస్పత్రులకు రోగుల తాకిడీ పెరిగింది. ప్రధానంగా జలుబు, జ్వరం, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులతో రోగులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నిర్లక్ష్యం వహించకుండా తగిన సమయంలో వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.


పిచ్చాటూరులో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

పిచ్చాటూరు: వాతావరణ మార్పులతో జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరగుతుండడంతో ప్రభుత్వాస్పత్రుల్లో రోజూ ఓపీ సంఖ్య పెరుగుతోంది. చాపకిందనీరులా టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కామర్లు, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు సైతం ప్రజలకు రోగాల నుంచి ఉపసమనం కలిగిస్తున్నాయి. ఉచిత పరీక్షలు, చికిత్సలు, అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. బ్యాక్టీరియాల కలుషిత నీటిని తాగడం ద్వారా టైఫాయిడ్, డయేరియాలతో పాటు దోమకాటు కారణంగా మలేరియా, డెంగీ వంటి జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. వీటి నివారణ కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోంది. ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బ్యాక్టీరియా పెరుగుదలకు ప్రధాన కారణమైన నీటి నిల్వలు లేకుండా క్షేత్రస్థాయిలో సిబ్బంది తగిన చర్యలు చేపడుతున్నారు. క్లోరినేషన్ చేయిస్తున్నారు. అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ పరిశుభ్రతను పాటించాల్సిందిగా అవగాహన కల్పిస్తున్నారు. రోగాల బారిన పడిన వారి రక్తనమూనాలను సేకరిస్తున్నారు. అవసరమైన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద ఉచితంగా వైద్యంతో పాటు మందులు పంపిణీ చేస్తున్నారు.

తీసుకోవల్సిన జాగ్రత్తలు

- ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని, వేడిగా ఉన్న ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి
- ఇంటి పరిసరాల్లో వినియోగించని టైర్లు, డ్రమ్ములు ఉంచరాదు
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు వహించాలి
- ఇళ్లలో కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి. దోమతెరలు వినియోగించాలి
- తరచూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకుంటూ ఉండాలి
- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

సొంత వైద్యం వద్దు



జిల్లా వ్యాప్తంగా వివిధ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈనేపథ్యంలో సొంత వైద్యం ప్రమాదకరం. సొంత వైద్యం ద్వారా తాత్కాలికంగా జ్వరం తగ్గవచ్చు. అయితే ప్లేట్లెస్ తగ్గిపోయి మనిషి నీరసించి కిందపడిపోయే ప్రమాదం ఉంది. జ్వరం తగ్గినా ఒంట్లో నీరసం ఉంటే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఉచితంగా రక్త పరీక్షలు చేసుకోవచ్చు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడుకోవాలి. వైద్య సిబ్బంది ఇంటి వద్దకే ఉచితంగా మందులను పంపిణీ చేస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న మెరుగైన వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ పి.రవిరాజు, డీఐఓ, చిత్తూరు జిల్లా

వైద్యులను సంప్రదించాలి



జ్వరం రాగానే వెంటనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వాస్పత్రులకు వెళ్లి వైద్యులను సంప్రదించాలి. వైద్యుల సిఫార్సుల మేరకు మందులు వాడాలి. అయినా జ్వరం తగ్గకపోతే రక్త పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణకు అవసరమైన మందులు వాడాలి. జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీరు తాగాలి. ప్రధానంగా పరిసరాల శుభ్రతను పాటించాలి.

–డా.గాయత్రి, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పిచ్చాటూరు.

సమష్టి కృషితో ఆదర్శ మండలంగా సత్యవేడు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతిమ

సత్యవేడు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండలాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేయాలని ఎంపీపీ వి. ప్రతిమ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని 17 సచివాలయాల పరిధిల్లో 23 ప్రభుత్వ భవనాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. వాటిలో గ్రామ సచివాలయాలు 10, రైతు భరోసా కేంద్రాలు 9, వెల్‌నెస్ సెంటర్లు 4 భవనాలను పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని కోరారు. చెరివి సబ్‌స్టేషన్ ఏఈ జగదీష్ మాట్లాడుతూ వ్యవసాయానికి 7గంటలు నిరంతర విద్యుత్ అందజేస్తున్నామన్నారు. వ్యవసాయాధికారి మురళి మాట్లాడుతూ మండల పరిధిలో 9వేల ఎకరాల్లో వరి సాగులో ఉందని, ఆర్‌బీకేల్లో ఎరువులు, సబ్సిడీకి జీలగ, జనుము విత్తనాలు అందజేస్తున్నామన్నారు. దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి గుణశేఖర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో7447 మందిని పరీక్షించామన్నారు. మెరుగైన వైద్యం కోసం 120 మంది పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేశామన్నారు. కంటి వెలుగు పథకం ద్వారా 504 మందికి కంటి అద్దాలు అందజేశారు. మరో 173 మందికి అద్దాలు అందజేస్తామని పేర్కొన్నారు. పురుషులు 3048, స్త్రీలు 4248 మందికి వైద్యసేవలు అందించామని తెలిపారు.

37 రోడ్ల నిర్మాణం పూర్తి

పంచాయతీ రాజ్ ఏఈ దేవిప్రసాద్ మాట్లాడుతూ గడప గడపకు నిధులతో 37 రోడ్లు పూర్తి చేసి రూ. 60 లక్షలు అందేశామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ భానుప్రకాష్ మాట్లాడుతూ 36 పనులకు రూ.64 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. రాచపాళెంలో శ్మశానానికి రోడ్డు వసతి కల్పించాలని సర్పంచ్ రూబెన్ కోరారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ డి.సరోజని, ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జరీనా, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, పశువర్ధక శాఖ ఏడీఓ గోవిందరాజ భాస్కర్, ఎంఈఓ కె.రవి, డాక్టర్ ఎంఎస్ సురేష్, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నారాయణవనం: రాష్ట స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్ బాల్ పోటీలకు స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పుత్తూరులో గురువారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్–17 విభాగంలో బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ప్రవీణ్, భార్గవ్, కల్పన, 9వ తరగతి విద్యార్థిని గిరిజ ఎంపికై నట్లు హెచ్‌ఎం సులోచన తెలిపారు. అలాగే అండర్–19 కేటగిరీలో చెంచు నాగేంద్ర, ఉదయ్ సాయి, స్టాండ్ బై లో సూర్య ప్రతాప్ రెడ్డి, వాసు ఎంపిక అయినట్లు పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు జయ ప్రకాష్, సదాశివం మాట్లాడుతూ నవంబర్ 4 నుంచి ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీఈటీలను ఉపాధ్యాయ బృందం, పేరంట్స్ కమిటీ అధ్యక్షుడు శరవణ రెడ్డి అభినందించారు.

సచివాలయాల్లో ఈ–క్రాప్ జాబితా


ఈ క్రాప్ జాబితాను చూపుతున్న ఏఓ


వరదయ్యపాళెం జాబితా ప్రదర్శిస్తున్న ఏఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 14 ఆర్‌బీకే కేంద్రాలలో ఖరీఫ్ 2023 ఈక్రాప్ జాబితాను ఉంచినట్లు, ఈ జాబితాను రైతులు పరిశీలించుకుని, తప్పులుంటే వ్యవసాయ సహాయకుల దృష్టికి తీసుకురావాలని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. ఆమె శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగ ఆర్‌బీకేలో ఖరీఫ్ 2023 ఈ క్రాప్ నమోదు జాబితాపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ లోపు తప్పులను సరిచేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. జాబితాలో తప్పులుంటే పంట బీమాతో పాటు, ప్రకృతి వైపరీత్యాలు కలిగినప్పుడు నష్ట పరిహారం ప్రభుత్వం నుంచి రాదని పేర్కొన్నారు. వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: ఖరీఫ్‌లో ఈ–కర్షక్ యాప్‌లో నమోదు చేసిన పంటల వివరాలను శుక్రవారం ఆర్బీకేల వద్ద ప్రదర్శించినట్లు వ్యవసాయశాఖ అధికారి సుహార్‌లత తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలో 698 మంది రైతులకు సంబంధించి 2,320 ఎకరాల్లో సాగు చేసిన ఖరీఫ్ పంటలను నమోదు చేసినట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే వీఏఏలకు లిఖితపూర్వకంగా నిర్దేశిత పత్రంలో పూర్తి చేసి ఇస్తే, వాటిని సరిచేసి 30వ తేదీన తుది జాబితాను ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ

వరదయ్యపాళెం: మండలంలోని సీఎల్ఎన్‌పల్లె ఎంపీటీసీ సభ్యురాలు ఉషారాణి భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రసాద్‌ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం పరామర్శించారు. ప్రసాద్ అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకున్నారు. వరదయ్యపాళెంలోని ఆయన ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం మత్తేరిమిట్టలో సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి నిర్మించిన ప్రైవేటు షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సర్పంచులు సింధూజ, వేణు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు


వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఖాదీ మహోత్సవాన్ని పురష్కరించుకుని శుక్రవారం మండల స్థాయిలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. తెలుగు మీడియంలో బుచ్చినాయుడు కండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పుష్కల్, ఇంగ్లిషు మీడియంలో ఏకలవ్య గురుకులానికి చెందిన గౌతంనాయిక్, హిందీలో వెస్టువరత్తూరు ప్రాథమికోన్నత పాఠశాల జ్యోత్స్న విజేతలుగా నిలిచారు, వక్తృత్వ పోటీల్లో తెలుగు మీడియంలో ఏకలవ్య గురుకుల విద్యార్థ విశ్వనాయిక్, బీఎన్‌కండ్రిగ పాఠశాల విద్యార్థి గిరీష్ గెలుపొందారు. ఎంఈఓ మునిసుబ్రమణ్యం, హెచ్‌ఎం రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వర స్వామికి అన్నాభిషేకం


అన్నాభిషేక అలంకరణలో స్వామివారు

చంద్రగిరి: తొండవాడ స్వర్ణముఖీనది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి(ముక్కోటి)వారి ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు స్వామివారికి అన్నాభిషేక సేవను నిర్వహించి, శోభాయమానంగా అలంకరించారు. మధ్యాహ్నం ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లు శేషవాహనంపై, రాత్రి భూత వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

పండుగలా గడప గడపకు మన ప్రభుత్వం


ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి పట్టణంలోని 2వ వార్డు భాస్కరపేట, కేఎంపల్లెలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పండుగలా సాగింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఏఏ ఇంటికి పథకాల ద్వారా ఎంత లబ్ధి అందిందో అంకెలతో వివరిస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందజేశారు. సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ ఇంటింటి వెళ్లినా పథకాల లబ్ధితో తాము సంతోషంగా ఉన్నామని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే మద్దతు ఇస్తామని చెప్పడం ఆనందంగా ఉందని తెలిపారు. ఏ ప్రభుత్వంలో లేని విధంగా నేరుగా ప్రజల ఖాతాల్లో పథకాల లబ్ధి చేరుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99శాతం నెరవేర్చారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, సుధాకర్, జగదీశ్వరయ్య, వెంకటేశ్వర్లు, లీలావతి, జనార్దన్‌రావ్ పవార్, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, గుమ్మడి బాలకృష్ణయ్య, ముత్యాల పార్థసారథి, వయ్యాలకృష్ణారెడ్డి, మున్నా, జయశ్యామ్, పంతులు, మల్లికార్జునగౌడ్, చంద్ర, కయ్యూరి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం


శిబిరంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రేణిగుంట: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరమని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీపతి అన్నారు. మండలంలోని విప్పమానుపట్టెడలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు విచ్చేసి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కంటి సమస్యలు ఉన్న వారికి అద్దాలను అందజేశారు. హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార ప్రదర్శన చేశారు. ఎంపీడీవో కార్యాలయ ఏవో హరిబాబు, వైద్య నిపుణులు డాక్టర్ అరుంధతి దేవి, వైద్యాధికారులు మధుసూదన్, తేజశ్విని, శ్రీలక్ష్మి, ఆరోగ్య సురక్ష క్యాంపు ఆఫీసర్ బేబిరాణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు నాణ్యమైన వంట పాత్రలు


వంటపాత్రలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

సత్యవేడు: మండలంలోని 65 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీకి జగనన్న గోరుముద్ద పథకం కింద నాణ్యమైన స్టీల్ వంట పాత్రలను ప్రభుత్వం అందజేసిందని ఎంపీపీ వి.ప్రతిమ, జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబరు, జెడ్పీటీసీ సభ్యురాలు పి. విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం 65 పాటశాలలకు మంజూరైన వంట సామగ్రిని ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. వంట పాత్రలను శుభ్రంగా ఉంచుకోనేట్లు ప్రధానోపాధ్యాయులు పరిశీలించాలన్నా రు. ఎనిమిది రకాల వంట పాత్రలు, వడ్డింపు గిన్నెలు, గెరిటెలు, అన్నం తయారీ పెద్ద పాత్రలు మంజూరైనట్లు ఎంఈఓ కె.రవి తెలిపారు. మండలానికి రూ.6.8 లక్షలు విలువ చేసే వంట పాత్రలు సరఫరా అయినట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ కె.చంద్రశేఖర్, ఎంఈఓ–2 ఉషా, సీఆర్పీలు కలసి ఎంఆర్సీలు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగాలు మరువలేనివి


రక్త దాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

సత్యవేడు: విధి నిర్వహణలో పోలీసుల త్యాగాలు మరువలేనివని పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. పోలీసుల అమరవీరుల దినోత్సవాల్లో భాగంగా శుక్రవారం సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ, సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో అసువులు బాసిన అమరులైన పోలీసుల త్యాగాలు శ్లాఘనీయమన్నారు. విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, పోలీసులు మొత్తం 72 మంది రక్తదానం చేశారు. శ్రీవెంకటసాయి చారిటబుల్ ట్రస్టు తిరుపతి టెక్నికల్ ఇన్‌చార్జి భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. డాక్టర్ సురేష్, సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన


కంటి ఆపరేషన్లకు వెలుతున్న రోగులతో వైద్యులు

నారాయణవనం: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన లభించింది. గత నెలలో మండలంలోని 12 సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలలో దృష్టి సమస్యలను ఎదుర్కొంటున్న 84 మందికి బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో తుది వైద్య పరీక్షలను నిర్వహించారు. వీరిలో 30 మందిని కంటి శుక్లం తొలగింపునకు, కంటి ఆపరేషన్ కోసం తిరుపతి అరవింద కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించినట్లు మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో ఉచితంగా ఆపరేషన్లు చేయించి, వారిని ఇంటి వద్దనే దిగబెడుతామని తెలిపారు. వైద్యాధికారి రాగసుధ, సీహెచ్‌వో శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్రయ్య పాల్గొన్నారు.

ఏఎల్‌ఎంకి తీవ్ర గాయాలు

పూతలపట్టు: ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై నుంచి పడి ఏఎల్‌ఎంకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, చిత్తూరు చెందిన శేఖర్ మండలంలోని చిటిపిరాళ్ల పంచాయతీ పరిధిలోని సబ్‌స్టేషన్‌లో అసిస్టెంట్ లైన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం కొత్తకోట సమీపంలో కరెంటు స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. వెంటనే సహచర సిబ్బంది చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు సిఫార్సు మేరకు వేలూరు సీఎంసీకి తరలించారు.

రైఫిల్ షూటింగ్‌కు 54 మంది విద్యార్థులు

తిరుపతి కల్చరల్: జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలలో ఉత్తమ ప్రతిభతో 54 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్‌పీజేఎన్‌ఎం స్కూల్లో శుక్రవారం అండర్–14, 17, 19 విభాగాలలో జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలలో అండర్ –14 విభాగంలో 18 మంది, అండర్–17 విభాగంలో 18 మంది, అండర్ –19 విభాగంలో 18 మంది మొత్తం 54 మంది ఎంపికైనట్లు ఫెడరేషన్ కార్యదర్శి పి.విజయకుమారి తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో ఎంపికైన వారు ఈనెల 28, 29, 30వ తేదీలలో రాజమండ్రి ఇంటర్నేషనల్ స్కూల్లో జరుగనున్న రాష్ట స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రైఫిల్ షూటింగ్‌కు ఎంపికైన వారిలో మారుతీనగర్, కొర్లగుంట శ్రీవారి హైస్కూల్‌కు చెందిన విద్యార్థి బి.యశ్వంత్ కృష్ణ ఉన్నారు. టీమ్ మేనేజర్ కె.సుధ, స్కూల్ ప్రిన్సిపల్ బాలక్రిష్ణయ్య, పీఈటీ శివ, యాజమాన్యం,వి ద్యార్థులకు పది రోజులపాటు కోచింగ్ ఇచ్చి తీర్చిదిద్దిన వారిని జాతీయ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ కార్యదర్శి దేవరాజు అభినందలు తెలియజేశారు.